




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు



సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| శనివారం 21 ఫిబ్రవరి 2026 | పేజీలు 04 | వేల రూ 2/- | సంపుటి 1 సంచిక 264 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|


## జాతీయ చేనేత దినోత్సవం-2026: రాష్ట్ర అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 21:- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం-2026 సందర్భంగా కొండ లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చేనేత మరియు జౌళి శాఖ అధికారులు ప్రకటించారు. చేనేత కళాకారులు, డిజైనర్లు మరియు చేనేత రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి ఈ అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. అవార్డుల కోసం అర్హత ప్రమాణాలుగా సీనియర్ కేటగిరీలో 31.12.2025 నాటికి 30 సంవత్సరాల వయస్సు పూర్తై కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలని, జూనియర్ కేటగిరీలో 31.12.2025 నాటికి 25 సంవత్సరాల వయస్సు పూర్తై కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను 31.03.2026 లోగా ఆయా జిల్లా చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులకు సమర్పించాల్సిందిగా సూచించారు. మరిన్ని వివరాలు మరియు దరఖాస్తు విధానం కోసం అధికారిక వెబ్‌సైట్ https://handtex.telangana.gov.in� ను సందర్శించాలని అధికారులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఘనంగా అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

## నాంపల్లి కోర్టు లో సంధ్య థియేటర్ కేసు ఛార్జ్‌షీట్ తిరస్కరణ



హైదరాబాద్: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో నాంపల్లి క్రిమినల్ కోర్టు మరోసారి ఛార్జ్‌షీట్‌ను తిప్పిపంపింది. ఇదే కేసులో ఇప్పటికే రెండుసార్లు ఛార్జ్‌షీట్‌ను రిటర్న్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో హీరో Allu Arjun సహా మొత్తం 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. అయితే దాఖలు చేసిన పత్రాల్లో సాంకేతిక లోపాలు ఉన్నట్లు కోర్టు గుర్తించింది. ముఖ్యంగా హార్డ్‌డిస్క్‌లు, సీడీలు, పెన్‌డ్రైవ్‌లు వంటి డిజిటల్ ఆధారాలు సమగ్రంగా జతపరచలేదని స్పష్టం చేస్తూ ఛార్జ్‌షీట్‌ను తిరస్కరించింది. అవసరమైన ఆధారాలు, సంబంధిత డాక్యుమెంట్లతో తిరిగి సమర్పించాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. ఈ పరిణామంతో కేసు విచారణలో మరింత ఆలస్యం జరిగే అవకాశాలు ఉన్నట్లు న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

## విద్యా నిర్మాణ పనులు వేగవంతం చేయాలి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 21: జిల్లాలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్‌లలో చేపడుతున్న మౌలిక సదుపాయాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో మండల విద్యా అధికారులు, సమగ్ర శిక్ష విభాగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎం శ్రీ పథకం, భవిత సెంటర్లు, కేజీబీవీ సివిల్ వర్క్స్‌తో పాటు పలు విద్యా నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. భవిత సెంటర్ల నిర్మాణంలో జహీరాబాద్, మోగుడంపల్లి, కల్హేర్, కొండాపూర్, మనోహర్, మునిపల్లి, పుల్కల్, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లో పనుల పురోగతిపై వివరాలు అడిగి నిర్మాణ వేగం పెంచాలని ఆదేశించారు. అలాగే కేజీబీవీ భవనాల నిర్మాణాల్లో న్యాల్కల్, నాగలిగిద్ద, పుల్కల్, మనూర్, సిర్గాపూర్, వట్పల్లి ప్రాంతాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పీఎం శ్రీ పథకం కింద సైన్స్ ల్యాబ్‌లు, ఇతర భవన నిర్మాణాల పురోగతిపై విద్యాశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన టాయిలెట్లను మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం శ్రీ బడ్జెట్, యూడైస్ డేటా, ప్రీ-ప్రైమరీ పాఠశాలల అంశాలను కూడా సమావేశంలో సమీక్షించి సంబంధిత విభాగాలకు డేటా ఖచ్చితత్వం, పనితీరుపై సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ ఏఐతో 'తెలంగాణ రైజింగ్' లక్ష్యసాధన

సందేశం టైమ్స్ , న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్‌చెయిన్ వంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలను సామాన్యుడికి చేరువ చేసి డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్య సాధనలో టెక్నాలజీని కేవలం సాఫ్ట్‌వేర్‌గా కాకుండా సమగ్ర మార్పుకు దోహదపడే ట్రాన్స్‌ఫార్మేషన్ టూల్‌గా వినియోగిస్తున్నామని తెలిపారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో భాగంగా శుక్రవారం నిర్వహించిన 'ఏజెంట్స్ ఆఫ్ ఛేంజ్; ఏఐ ఫర్ గవర్నమెంట్ సర్వీసెస్ అండ్ క్లైమేట్ రెసిలియెన్స్' చర్చా కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. పౌర సేవలకు టెక్నాలజీని అనుసంధానం చేసి ప్రభుత్వం-పౌరుల మధ్య దూరాన్ని తగ్గించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, ఐకం (AIKAM), ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్స్ఛేంజ్, భూ భారతి వంటి సంస్కరణలు డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణ బ్రాండ్‌ను బలోపేతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక ఫలాలను ప్రాంతం లేదా వర్గానికి పరిమితం చేయకుండా అందరికీ చేరేలా 'ఏజెంటిక్ ఏఐ' వినియోగంపై దృష్టి సారించామని, టెక్నాలజీని వ్యవసాయం, వాతావరణ మార్పులు, ఆరోగ్యం, సుస్థిర నగరాల అభివృద్ధి, క్లీన్ ఎనర్జీ, విపత్తు నిర్వహణ తదితర రంగాలకు విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు




## డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం: మంత్రి జూపల్లి కృష్ణారావు

సందేశం టైమ్స్ హైదరాబాద్, ఫిబ్రవరి 21: మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను శుక్రవారం రవీంద్ర భారతి లో మంత్రి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు బారిన పడుతున్న యువత భవిష్యత్తు నాశనమవుతోందని, ఎన్నో కుటుంబాలు చితికిపోతున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయని, ఇలాంటి అరాచక శక్తులను సమాజం నుంచి ఏరిపారేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. "డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే మన లక్ష్యం కావాలి" అని స్పష్టం చేశారు.విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె బలిదానం వృథా కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కుటుంబానికి రూ.1 కోటి ఆర్థిక సహాయం అందించిందని గుర్తుచేశారు.స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడమే కాకుండా అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇవ్వాలనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని తెలిపారు. అవసరమైన ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆయుధాలను అందజేస్తామని ప్రకటించారు.అక్రమ మద్యం నియంత్రణ, మాదక ద్రవ్యాల నిర్మూలనలో అంకితభావంతో పని చేస్తున్న అధికారులను మంత్రి అభినందించారు. రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడికి అధికారులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని, ఈ పోరాటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అవసరమైన వనరులు కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) జి.అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్, అసోసియేషన్ అధ్యక్షుడు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణా అవకాశాల గని.. ఏఐ పరిశోధనలకు అపారమైన టాలెంట్ పూల్ మా బలం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు






సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: తెలంగాణా అవకాశాల గని అని, రాష్ట్రంలో ఏఐ పరిశోధనలు, ఆవిష్కరణలకు ప్రభావశీలమైన టాలెంట్ పూల్ ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో జరుగుతున్న ప్రతిష్టాత్మక ఏఐ సమ్మిట్‌లో స్వీడెన్ వాణిజ్య ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కృత్రిమ మేథ వెల్లువ వల్ల ఎదురయ్యే సవాళ్లను, అదే సమయంలో తీసుకువచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ముందే సంసిద్ధమైందని, సాఫ్ట్‌వేర్ నిపుణుల నైపుణ్యాలను పెంచే కార్యక్రమాలు ప్రారంభించామని పేర్కొన్నారు. ఏఐ విస్తృతితో ఉద్యోగ విధుల్లో గణనీయమైన మార్పులు వస్తాయని, అందుకు అవసరమైన సన్నద్ధతను ప్రభుత్వం మొదలుపెట్టిందన్నారు. ఏఐ పరిశోధన కేంద్రాలు, అప్లికేషన్లు, సేవల ద్వారా కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయని, యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత, వృత్తి నిపుణులు మరింత సృజనాత్మక బాధ్యతలు చేపట్టేందుకు ఏఐ అపార అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్ కార్యక్రమాలను రెండేళ్లుగా ప్రాధాన్యంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాల్లో ఏఐ వినియోగం వల్ల లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెరిగి దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని, ఇందుకు అవసరమైన అప్లికేషన్ల రూపకల్పనలో గ్లోబల్ టెక్ కంపెనీలు భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. కృత్రిమ మేథ ఫలాలను ప్రజలందరికీ చేరవేయడానికి ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించే బృహత్తర యజ్ఞం కొనసాగుతోందని, టీ-ఫైబర్ ద్వారా గ్రామాలను ప్రపంచంతో అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. ఏఐ ఓ గేమ్ చేంజర్ అని, దానిని సమర్థంగా వినియోగించుకుని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంలాంటిదని, రాష్ట్రంలో అనుకూల ఎకోసిస్టమ్, నిరంతర విద్యుత్ సరఫరా, స్థిరమైన విధానాలతో పెట్టుబడిదారులకు ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తోందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండ లక్ష్మణ్ బాపూజీ అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానం



సూర్యాపేట సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 21:- జాతీయ చేనేత దినోత్సవం ఆగస్టు 7ను పురస్కరించుకుని చేనేత రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న కళాకారులను ప్రోత్సహించేందుకు కొండ లక్ష్మణ్ బాపూజీ అవార్డును ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చేనేత సంప్రదాయాలను కాపాడుతూ నూతన డిజైన్లతో రంగాన్ని అభివృద్ధి చేస్తున్న నేయాళ్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఎంపికైన వారికి రూ.25,000 నగదు పురస్కారం, ప్రశంసాపత్రం మరియు సత్కారాలతో ఘనంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ పూర్తి పేరు, ఫోన్ నంబర్, గ్రామం, ఆధార్ కార్డు ప్రతులు, బ్యాంక్ వివరాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. సీనియర్ కేటగిరీలో 30 సంవత్సరాలు నిండినవారికి కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలని, జూనియర్ కేటగిరీలో 25 సంవత్సరాలు నిండినవారికి కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలని నిబంధనలు వెల్లడించారు. దరఖాస్తుల చివరి తేదీ 31.03.2026గా నిర్ణయించగా, ఎంపికైన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల చేనేత కళాకారులు గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు



## కొప్పుల శేషారెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్ల ప్రారంభం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 21 (సందేశం టైమ్స్ అందోల్ మండల టౌన్ రిపోర్టర్ బి. రమేష్ బాబు) అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషితో నియోజకవర్గంలో గ్రామీణ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ సాయిలు, గ్రామ పార్టీ అధ్యక్షుడు సాయిలు, రఘుపతి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, వార్డు సభ్యులు రమేష్, శీను, షరీఫ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరవెల్లి సిఎస్ఐ సంఘంలో ఉపవాస ఆరాధనలు ప్రారంభం





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 21 (సందేశం టైమ్స్ అందోల్ మండల టౌన్ రిపోర్టర్ బి. రమేష్ బాబు) అందోల్ నియోజకవర్గంలోని వట్పల్లి మండలం మరవెల్లి గ్రామంలోని సిఎస్ఐ సంఘంలో ఉపవాస ఆరాధనలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి నాలుగు సంఘాల విశ్వాసులు హాజరై ప్రత్యేక ఆరాధనలో పాల్గొన్నారు. ఆరాధన సందర్భంగా క్రీస్తు ప్రేమ, దయ, కరుణల సందేశాన్ని విశ్వాసులకు బోధించారు. దేవుడు ప్రతి ఒక్కరిపై అపారమైన ప్రేమ చూపిస్తాడని, అనేక ప్రజలను కాపాడిన రక్షకుడు యేసుక్రీస్తు అని పరిశుద్ధ వాక్యం తెలియజేస్తుందని స్థానిక గురువులు రెవ. జి. దేవదాస్ పేర్కొన్నారు. ఈ ఆరాధనలో విశ్వాసులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు

# డాకూరులో ఘనంగా బీరప్ప గుడి ప్రాణ ప్రతిష్ట, గజస్తంభ స్థాపన మహోత్సవం



సందేశం టైమ్స్, జోగిపేట్, ఫిబ్రవరి 21 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం డాకూరు గ్రామంలోని బీరప్ప గుడిలో విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం మరియు గజస్తంభ స్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఉప సర్పంచ్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు, వేదమంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడం ఆనందంగా ఉందని, భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతమైందని డాకూరు ఉప సర్పంచ్ మురళి తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాకూరు సర్పంచ్ యశ్వంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ తమ్మల శీను, మాజీ సర్పంచ్ రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సూర్యాపేట మున్సిపల్ చైర్మన్‌గా మొరిశెట్టి నివేదిత బాధ్యతల స్వీకారం



తెలంగాణ | సూర్యాపేట

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఫిబ్రవరి 21: సూర్యాపేట నూతన మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మొరిశెట్టి నివేదిత శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, మున్సిపల్ పరిపాలనలో సమర్థవంతంగా పనిచేసి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. చైర్మన్ వెంట మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుమ్మడి నరసయ్య, రామిరెడ్డి సర్వోత్తమ రెడ్డి, పోతు భాస్కర్ తదితరులు ఉన్నారు. ఈ విషయాన్ని జిల్లా పౌర సంబంధాల అధికారి, సూర్యాపేట ఒక ప్రకటనలో తెలిపారు.

# ఐస్క్రీంలో అసభ్యకర కల్తీ.. నెక్కొండలో విక్రేత అరెస్ట్, శాంపిల్స్ సేకరణ




సందేశం టైమ్స్, వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 21: వరంగల్ జిల్లా నెక్కొండలో ఐస్క్రీం విక్రేత చేసిన హేయకృత్యం వెలుగులోకి రావడంతో స్థానికంగా కలకలం రేగింది. రాజస్థాన్‌కు చెందిన కాలురాం పుర్బియా అనే వ్యక్తి అంబేద్కర్ కూడలిలో ఐస్క్రీం బండి నిర్వహిస్తూ ఉండగా, ఆహార పదార్థాల్లో అనుచితంగా కల్తీ చేస్తున్నట్టు ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వీడియో వైరల్ అయింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు స్పందించి ఎస్ఐ మహేందర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వరంగల్ జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చేపూరి కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని ఐస్క్రీం నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. పంచాయతీ కార్యదర్శి సదానందంతో కలిసి బండిలో ఉన్న పదార్థాలను పారబోశారు. ఈ సందర్భంగా సీఐ చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగించే ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయట తినుబండారాలు కొనుగోలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నెక్కొండలో ఐస్క్రీం విక్రేతలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.



# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి కొప్పుల శేషారెడ్డి హాజరు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 21 (సందేశం టైమ్స్ అందోల్ మండల టౌన్ రిపోర్టర్ రమేష్ బాబు) అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం మండల పరిధిలోని వెంకట్రావుపేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వట్టిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి, అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తోందన్నారు. గత ప్రభుత్వం చేయనంత అభివృద్ధిని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని పేర్కొన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో అందోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డి, ఏపీఓ సుధాకర్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 10వ వార్డులో ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ


సందేశం టైమ్స్,సంగారెడ్డి, ఫిబ్రవరి 21.(సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్).సంగారెడ్డి జిల్లా జోగిపేట అందోల్ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా పట్టణంలోని 10వ వార్డులో నూతనంగా మంజూరైన గృహాల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ-ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సదుపాయం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## మేడికుందలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 21 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మేడికుంద గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమం సర్పంచ్ యన్ చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ప్రభుత్వం రూ.10 లక్షల వ్యయంతో మహిళా సమాఖ్య భవనాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సమైక్య అధ్యక్షురాలు టి. పుష్పలత మాట్లాడుతూ మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళల అభివృద్ధికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ యన్ కాచూర్ రావు, వార్డు సభ్యులు విష్ణురావు, పోచయ్య సురేష్, పాపయ్య, హరిబారావు, మాణిక్ రావు, అనిల్, డీలర్ బేతయ్య తదితరులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్‌లో కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ నూతన గృహప్రవేశం




సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఫిబ్రవరి 21 (సందేశం టైమ్స్ నారాయణఖేడ్ నియోజకవర్గం ఇన్చార్జి టీ. చంద్రశేఖర్) నారాయణఖేడ్ పట్టణంలో శ్రీశ్రీశ్రీ కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జీఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుజ్జపు మచ్చేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహారాజ్ గారికి నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేసిన గుజ్జపు మచ్చేందర్, వారి జీవితం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. అలాగే, ఆధ్యాత్మిక సేవలు మరింత విస్తరించాలని అభిలషించారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుముల మారుతి, నారాయణఖేడ్ మండల మాజీ జడ్పిటిసి రవీందర్ నాయక్, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, బోరంచ గ్రామ నాయకులు నర్సింలు, నారాయణఖేడ్ మున్సిపల్ నాయకులు శ్రీకాంత్, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు. భక్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై మహారాజ్ గారికి శుభాకాంక్షలు తెలిపారు.

## కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో ఆహార విషబాధ కలకలం: 25 మంది విద్యార్థినులు అస్వస్థత





సందేశం టైమ్స్, రేగోడ్, ఫిబ్రవరి 21 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్) మెదక్ జిల్లా రేగోడు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నిన్న రాత్రి భోజనం చేసిన అనంతరం 25 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన కలకలం రేపింది. తెల్లవారుజామున నుంచి వరుసగా వాంతులు చేయడంతో పాఠశాల సిబ్బంది అప్రమత్తమై విద్యార్థినులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్ఎస్‌సి ఇంటర్నల్ మార్క్స్ వెరిఫికేషన్ బృందంలోని నలుగురికి కూడా అస్వస్థత కలిగింది. పది మందికి గ్లూకోజ్ చికిత్స అందించగా, ప్రస్తుతం ఎవరికీ ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఆహార విషబాధ కారణంగా ఈ ఘటన జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పోలీసులు విచారణ చేపట్టగా, ప్రిన్సిపాల్ విద్యార్థినులకు ధైర్యం చెబుతూ పాఠశాలలోనే హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి చికిత్స అందిస్తామని, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని తెలిపారు.




## జోగిపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ చిట్టిబాబు ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు

సందేశం టైమ్స్, ఆందోల్/జోగిపేట, ఫిబ్రవరి 21 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్) అందోల్ పరిధిలోని జోగిపేట మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ చిట్టిబాబు ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ మాసం ప్రారంభ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి, సహనం, దానధర్మాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఉపవాస దీక్షలు ఆచరించే ఈ పవిత్ర సమయంలో పరస్పర గౌరవం, ప్రేమాభిమానాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. సమాజంలో సౌహార్ద్రం, సోదరభావం పెంపొందాలని, ప్రజలంతా ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఉపవాసాలు ఆచరిస్తున్న ప్రతి ఒక్కరికి అల్లాహ్ కరుణాకటాక్షాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.

## గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ అక్బరుద్దీన్ ఒవైసీపై సంచలన సవాల్; "ఐదు నిమిషాలు ఇచ్చి చూద్దాం" అని డిమాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (సందేశం టైమ్స్) — గోషామహల్ ఎమ్మెల్యే టీ. రాజా సింగ్ శుక్రవారం అర్ధరాతి తేదీన వరంగల్‌లో ఒక ప్రజాసభలో రాజకీయ ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఒవైసీ చేసిన కొన్ని వ్యాఖ్యలు మరియు వివాదాస్పద ప్రకటనలను ఉద్దేశించి, రాజా సింగ్ "ఒవైసీ చెప్పిన 15 నిమిషాల సమయం ఇవ్వబడినా ఏ విశేషం జరుగదని" చెప్పి, ఐదు నిమిషాల సమయానికే ఏర్పడే ఫలితాన్ని చూపాలని ఇస్తారు, చూద్దాం" అని సవాల్ విసరారు. రాజా సింగ్ ఈ సందర్భంలో అడ్డంగా నిలబడి ఉంటానని, ఏ సమయంలోనైనా తాను ఎదుర్కొనే సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద సంచలనం సృష్టించి అభిమానులు, విమర్శకుల మధ్య చర్చలను కలిగిస్తున్నాయి.



# న్యూఢిల్లీలో సీఎం ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం జాతీయ నాయకత్వంతో సమావేశం

## తెలంగాణ అభివృద్ధి పథాన్ని వేగవంతం చేసే దృఢ సంకల్పం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 21 తెలంగాణ అభివృద్ధి పథాన్ని మరింత వేగవంతం చేయాలనే దృఢ సంకల్పంతో, ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు కేబినెట్ సహచరులు, రాష్ట్ర సీనియర్ నాయకులతో కలిసి న్యూఢిల్లీలో పార్టీ జాతీయ నాయకత్వాన్ని కలిశారు. ముఖ్యమంత్రి గారి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఏఐసీసీ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత శ్రీ మల్లికార్జున ఖర్గే గారు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ గారిని మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర అభివృద్ధిపై సమగ్ర చర్చ నిర్వహించింది. సమావేశంలో ప్రధానంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్, దాని వ్యూహాత్మక రోడ్‌మ్యాప్, ప్రభుత్వ ప్రాధాన్యతలు, కీలక వాగ్దానాల అమలు, విధానపరమైన నిర్ణయాలు, అభివృద్ధి పురోగతి, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు, నిర్మాణాత్మక సంస్కరణలపై చర్చ జరిగింది. సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న అంకితభావాన్ని ముఖ్యమంత్రి గారు పునరుద్ఘాటించారు.డిసెంబర్ 2023లో 'ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం' ప్రారంభించినప్పటి నుంచి మహిళలు, రైతులు, యువత సాధికారత కోసం చేపట్టిన విప్లవాత్మక చర్యలు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, జిల్లాలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి లభిస్తున్న విశేష ప్రజా మద్దతును ప్రతినిధి బృందం జాతీయ నాయకత్వానికి వివరించింది.జాతీయ నాయకత్వం ఇచ్చిన మార్గదర్శకత్వం తెలంగాణ సమగ్ర, సమాన అవకాశాల అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని మరింత బలపరుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



# ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి "ఏఐ కౌన్సిల్" ఏర్పాటు, జాతీయ-ప్రభుత్వ-సాంకేతిక మార్గదర్శకత్వానికి ప్రతిపాదనలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 21 కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్) యావత్ ప్రపంచాన్ని తీవ్ర ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు జాతీయ స్థాయిలో జీఎస్టీ కౌన్సిల్, నీతి ఆయోగ్ తరహాలో "ఏఐ కౌన్సిల్"ను ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి గారికి కోరారు. అలాగే, జాతీయ భద్రత, దేశ ప్రయోజనాలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక "ఏఐ మంత్రిత్వ శాఖ"ను ఏర్పాటు చేయాలని సూచించారు.న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన "ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో ముఖ్యమంత్రి గారు కీలకోపన్యాసం నిర్వహించారు. తెలంగాణ ఏఐ స్టార్టప్ విలేజ్ ఏర్పాటుకు సిద్ధంగా ఉందని, కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్ కేంద్రంగా "జాతీయ ఏఐ వార్‌రూమ్" ఏర్పాటు చేయగలమని ప్రకటించారు.సదస్సులో ప్రధానంగా ఏఐలో వేగంగా వస్తున్న మార్పులు, దేశంలోని ప్రతి ప్రాంతానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా రీ-స్కిల్లింగ్ వ్యూహాలు, GPU చిప్ తయారీ, గ్రీన్ ఎనర్జీ, డేటా స్టోరేజీ, కోర్ ల్యాంగ్వేజెస్ ఆధారిత ఏఐ సేవలు వంటి రంగాల్లో భారత్ నాయకత్వం వహించాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి గారు వివరించారు.అయితే, ఏఐ విప్లవాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉద్యోగాలు కాపాడి, కొత్త అవకాశాలను సృష్టించడం, ప్రపంచ స్థాయిలో భారత్‌ను ఏఐ సృష్టికర్తగా నిలిపేందుకు వేగవంతమైన పెట్టుబడులు, బలమైన సంస్థలు, వ్యూహాత్మక విధానాలు అవసరమని ఆయన పునరుద్ఘాటించారు.




# నవాబ్ కేఫ్' మూవీ: ప్రేక్షకుల ముందుకు రూపంలో విడుదల — సమీక్ష & విశ్లేషణ

సందేశం టైమ్స్ సినిమా వార్తలు : నవాబ్ కేఫ్ 2026లో విడుదలైన తెలుగు చిత్రంగా ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శివ కందుకూరి, తేజు అశ్విని, రాజీవ్ కనకాల హీరోలు-హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం ప్రమోద్ హర్ష దర్శకుడిగా తెరకెక్కింది. మూవీ మొదట "ఛాయ్‌వాలా"గా ప్రకటించబడినా, సెన్సార్ బోర్డు అభ్యంతరాల నిమిత్తం పేరు మార్చి **'నవాబ్ కేఫ్'**గా విడుదలైంది.ఈ కథ 400 సంవత్సరాలుగా జనపారంపర్యంగా నడుస్తున్న చిన్న పానీయాల కేఫ్ "నవాబ్ కేఫ్"ను మధ్య ప్రవేశబెట్టుకుని, తండ్రి-కొడుకు మధ్య ఉన్న భావోద్వేగ సంబంధాన్ని కేంద్రీకరించి సాగుతుంది. తండ్రి రోజు రోజు వస్తున్న సంప్రదాయాన్ని ప్రేమగా కొనసాగించడంపై యవకుడు రాజా తన వ్యక్తిగత ఆశయాల కోసం ఎదురు పోరాటం చేస్తాడు. సినిమా సమీక్ష & రేటింగ్: కొన్ని సమగ్ర రివ్యూల ప్రకారం సినిమా 2/5 నుండి 2.5/5 వరకు తేలికపాటి రేటింగ్ అందుకొంటోంది, దీనికి కారణం పునరావృత కథా నిర్మాణం, అనేక పాత తరహా సినిమాల ప్రతిఫలాల సమాన భావన, మధ్యలో నెమ్మది వంటి అంశాలు.కథలోని భావోద్వేగ సన్నివేశాలు మరియు కుటుంబ పరిమాణం కొంత ఆకర్షణీయంగా ఉంటే కూడా మొత్తం చిత్ర ప్రయాణం కొంత నెమ్మది అనిపించింది అనే సమగ్ర విమర్శలు ఉన్నాయి.కొంతమంది విశ్లేషకులు, ఈ చిత్రంలో నట ప్రయోగాలు, పాత్రల భావన బాగా ఉంటుందని సూచించినప్పటికీ నిరూపిత కథా దార్శనికత లేకపోతే ప్రేక్షకులపై ప్రత్యేక స్ఫూర్తి రాలేదని పేర్కొన్నారు. ఉపసంహారం 'నవాబ్ కేఫ్' భావోద్వేగ కుటుంబ కథను నిర్మాణాత్మకంగా చూపించే యత్నంతో వచ్చిన చిత్రం. నటీనటుల ప్రదర్శన, పూర్వీకులపై ఆధారపడి కథ చెప్పే ప్రయత్నం ఉంటే కూడా, కొత్తదనం లేకపోవడం, స్క్రీన్‌ప్లే పటం కొంచెం నెమ్మదిగా సాగడంతో ఇది ఒక సాధారణ శ్రేణి భావోద్వేగ ఎంటర్‌టైనర్‌గా నిలిచింది.కాస్ట్ & క్రూయో: శివ కందుకూరి, తేజు అశ్విని, రాజీవ్ కనకాల, చైతన్య కృష్ణ, రాజ్‌కుమార్ కసిరెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. https://telugu.filmibeat.com/ మొత్తం:విడుదల తేదీ: ఫిబ్రవరి 20, 2026 సామాన్య ప్రేక్షకుల కోసం కుటుంబ-భావోద్వేగ కథగా నిలవటానికి ప్రయత్నించిన చిత్రం.



# అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు అధ్యక్షుడికి సుంకాలు విధించే అధికారాలు లేవని స్పష్టం

సందేశం టైమ్స్, అంతర్జాతీయ న్యూస్, ఫిబ్రవరి 21,అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పులో, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు (టారిఫ్‌లు) విధించే అధికారాలు వైట్‌హౌస్‌కు, అంటే అధ్యక్షుడికి లభించలేదని స్పష్టం చేశారు. ట్రంప్ గతంలో పలు దేశాలపై, వాటిలో భారత్‌ను కూడా చేరుస్తూ, ఉత్పత్తులపై 18 శాతం వరకు సుంకాలను విధించిన విషయం తెలిసిందే.తీర్పు ప్రకారం, ఈ విధమైన నిర్ణయాలు కాంగ్రెస్ ద్వారా ఆమోదించబడిన చట్టాల పరిమితులలో ఉండాలి. అధ్యక్షుడికి ఒకవైపు ఒక వైపు ఉత్పత్తులపై స్వయంగా సుంకాలను నిర్ణయించడానికి ప్రత్యేక అధికారం ఇవ్వబడలేదు. ఈ తీర్పుతో అమెరికాలోని వ్యాపార రంగం, స్టాక్ మార్కెట్లు, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలపై గణనీయ ప్రభావం ఏర్పడింది.ఇప్పటి వరకు ట్రంప్ అనేక దేశాలపై సుంకాలను విధిస్తూ, వాణిజ్యపరంగా విస్తృత ప్రభావం చూపారు. ఈ తీర్పుతో, పౌర, వ్యాపార, విదేశీ వ్యాపార రంగాలందరికీ కొత్త నియమావళి స్పష్టమైంది. అమెరికా వ్యాపార నిపుణులు, అంతర్జాతీయ మార్కెట్ విశ్లేషకులు దీన్ని "ట్రంప్ పాలసీపై ప్రధాన సవరణ"గా, "వ్యవహారాల న్యాయ పరిమితిని గుర్తించిన తీర్పు"గా విశ్లేషిస్తున్నారు.సారాంశంగా, ఈ తీర్పు అధ్యక్షుడికి స్వయంగా సుంకాలు విధించే అధికారాలు లేవని స్పష్టం చేసి, కేంద్రం/కాంగ్రెస్ చట్టాల పరిమితులలో మాత్రమే ఈ విధమైన నిర్ణయాలు తీసుకోవచ్చని రుజువుచేసింది. దీని ఫలితంగా అమెరికా మరియు ఇతర దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు, భవిష్యత్తులో టారిఫ్ విధింపులపై నిర్ణయాలు మరింత చట్టబద్ధంగా, న్యాయ పరంగా తీసుకోవాల్సి ఉంటుంది.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.